



కథానిక

వల్లపురెడ్డి

ఆనాడు అతని భావనల్లో నవోదయం. అప్పుడతడు చదువుతున్నాడు. అప్పుడతను సాగిస్తూన్న చదువుకంటే ఇంకో ముఖ్యమైన సమస్యను పరిష్కరించుకోవటంలో శ్రద్ధతీసుకున్నాడు.

ఎందరో దేశభక్తుల కృషిఫలితంగా దాదాపు రెండువందల సంవత్సరాల తరువాత భారతీయులు తమ దేశమాతను దాస్యబంధనాలనుండి విడిపించుకోగలుగుతున్నారు, తన బిడ్డలు రాబోతూన్న స్వాతంత్ర్యాన్ని నిలఁబెట్టుకోగలుగుతారోలేదోనని భారతజనని వదనంలో ప్రస్ఫుటమయ్యే అనుమాన రేఖలతని కగుపడినయి. భారతి కనుగొలఁకుల నుండి జారే కన్నీటి బిందువులాతని హృదయాన్ని కలవరపరచినయి. 'తల్లీ: నా చదువంతా నీకొఱకే ఇకముందెప్పుడూ మా బుద్ధి లోపంచే నిన్నితరుల పాలబడనీయం, ఏమైనాసరే నా సర్వస్వమూ నీకొఱకే బలిచేస్తాను.' అని ఆవేశంలో మనస్సునందే ప్రతిన తీసుకున్నాడు. అది ఆవేశంకాదు; మాతృభూమిపై పొంగిపొర్లే ప్రేమ. అతఁడు పరిష్కరించుకున్న సమస్య ఇదే. తన చదువు విలువను ఈ ప్రతినను నెరవేర్చటంలో లీనం చెయ్యాలనుకున్నాడు.

1947 వ సంవత్సరము 15 వ తేది ఆగస్టున భారతదేశం స్వతంత్రమైంది. ప్రతి భారతీయుని హృదయంలో జాతీయ భావమంకురించింది. ప్రతి భారతనారి పూర్వుల చరిత్ర నొకసారి వల్లెవేసి, తన బలహీనతను గాంచి సిగ్గుపడి ఇకముందు తప్పటడుగులువేసి స్వాతంత్ర్యాన్ని కోలుపోనని దీక్షబూనింది. అదిగాక ఆనాడు ప్రారంభమౌతూన్న ప్రభుత్వవిధాన మతి నూతనం. దాన్ని భారతీయు లెన్నఁడూ చవిచూచి యెఱుఁగరు. అది ప్రజాప్రభుత్వం. నాయకులు దేశీయులు, పాలితులు దేశీయులు; పాలన దేశీయులకొఱకు, ముచ్చటైన మూఁడురంగుల పతాకం విజయోత్సాహంతో ఢిల్లీలో లాల్ ఖిల్లాపై రెపరెపలాడింది. భారతమాత వదనంలో సంతృప్తితో గూడిన లేనవ్వొకటి తొంగిచూచింది.

ఇంతజరిగినా అతనిలో సంతోషముదయించ లేదు. అతని ఆశకొక అంతరాయం కలిగింది. ఇతర రాష్ట్రాలలో ఎరిగినట్లు జాతీయ పతాకం హైదరాబాదు — అతని జన్మరాష్ట్రం—లో ఎగురలేదు. అక్కడి ప్రజల్లో చాలామంది త్రివర్ణ పతాకాన్ని వ్యోమవీధిలో ఎగురుతూండగా చూడలేకపోయారు. స్వాతంత్ర్యేచ్ఛగల ప్రజానీక మాపతాకారోహణకై పెక్కు ఇడుమలపాలు గావలసివచ్చింది. ఇంతా ఎందుకంటే, తనస్టేటు భారత గణరాజ్య సమితిలో చేరగూడదనే నిజాం నవాబు మొండిపట్టు దీనిని చాలామంది నిగ్రహించారు. ఈ మొండిపట్టే క్రమంగా హిందూ ముస్లింల మతకల్లోలానికి దారితీసింది. కుమారుల తెలివిమాలిన తనాన్ని చూచి దేశమాత భోరున ఏడ్చింది. హృదయాన్ని ద్రవింపఁజేసే ఆ రోదన అతని చెవుల్లో ప్రతిధ్వనించింది. హృదయకమలంపై శూలం గ్రుచ్చినట్లయింది. అతని ప్రతిన ద్విగుణీకృతమై కార్యదీక్షను పూనమంది. అతనూ

హైదరాబాదీయుండే. భారతీయులందరూ సంతోషించాల్సిన దినాన హైదరాబాదులోని ప్రజలు తీరని నైరాశ్యానికి గురికావటం శోచనీయం! 15 వ ఆగస్టునుండే విద్యార్థులందరూ ఆందోళన ప్రారంభించారు. ఆ ఆందోళనలో అతడు ప్రధానకార్యాన్ని నిర్వహించాడు. తత్ఫలితంగా సంప్రాప్తమయింది కారాగారావాస శిక్ష.

* * *

ఒక చిన్న పల్లెటూరులో అతనితల్లి 'నా' అనే వారులేని మేనమామ కూతురుతోబాటు ఉండేది. ఆ సంవత్సరముతో పిల్లవాడు చదువు పూర్తిచేసి సంసారం సాగిస్తాడుగదా అనే ఆశ తల్లిలో యుండేంది. మేనమామకూతురు తనస్వామిగా అతన్నే నిర్ణయించుకుంది. విద్యార్థుల ఆందోళన ప్రారంభమైందని తల్లి కర్ణాకర్ణిగావిని, భయపడి కొడుక్కు ఉత్తరం వ్రాయించింది—వీలయినంత త్వరలోవచ్చి తనఒడిలో వాలమనీ, 'బ్రతికియుంటే బలుసాకయినా తినవచ్చునని'—కాని ఆఉత్తరం ప్రత్యుత్తరాన్ని తీసుకురాలేకపోయింది. ఆమె విషాదము అంచులు దాటింది. ఆఖరుకు తన అన్న కూతురుతో "అమ్మాయి జ్యోతీ, నీవయినా ఒక ఉత్తరం వ్రాయమ్మా, నీపిలుపైనా వినివస్తాడేమో!" అంది. ఆమె వ్రాయలేక వ్రాయలేక సిగ్గుతో ఎట్లో వ్రాసింది. చివరకు ఆ సిగ్గులో తనబావ తప్పకుంటా వస్తాడనే నమ్మకం తొంగిసలాడింది. కాని, ఆ ఉత్తరంగూడా మొదటిదాని అడుగుజాడల్లో నడిచింది. ఇద్దరూ మనస్సుల్లో కుళ్ళసాగారు.

అతడప్పుడు నలుబదికోట్ల భారతీయుల తల్లి ఒడిలో వాలబోతున్నాడు; ఈ తన ఒక్కడితల్లి ఎలా కనిపిస్తుందతనికి? చేపట్టబోయే విజయలక్ష్మి పిలుపు ముందట ఈ మేనమామ కూతురుయొక్క స్వల్ప ఆహ్వానం ఎంతటిది?వాళ్లు వ్రాసిన ఉత్తరాలు అందడగిన వారికందక పోటిమిగదాఅనే చింతతో కాలేజి లెటరుబోర్డుపై కళ్ళంతగా చేసుకుని చూస్తూ పడిఉన్నాయి.

* * *

పల్లెటూళ్ళకు వార్తాపత్రికలు చాలా కొద్దిగా వస్తాయి. అవికూడా ఎవరో చదువుకున్నవాళ్ళు ధనవంతులు తెప్పించు కుంటారు. వాటిలోని వార్తలు సామాన్యుల చెవులదాకా అసలు పోనే పోవు. పోయినా అరుదుగా పోతాయి.

ఒకనాడు వార్తా పత్రికలో తమ యూరిపేరుండటం చూచి ఆయూరి పెద్దమనిషి ఆశ్చర్యపడి ఆ వివరాన్ని పూర్తిగా చదివాడు. సంతోషం పట్టలేక సరాసరి పరుగెత్తుకెళ్ళి ఆ ఎమ్మే.విద్యార్థి తల్లితో "అమ్మా జానకమ్మా! చూశావటమ్మా నీ కొడుకు మన ఊరికి ఘనకీర్తి సంపాదించి పెట్టాడమ్మా" అని ఉబికివచ్చే సంతోషాన్ని బిగపట్టుకుని చెప్పాడు. కొడుకుపేరు వినటంతోనే ఆమె చాలా సంతోషించి ఆత్రుతతో "ఏం జరిగిందన్నా, ఏడీ నా కొడుకు?" అని అడిగింది. అతడు తన స్వంతమాటల్లో చెప్పటమేమీ బాగుండదని వార్తా పత్రికలోని వ్రాతను ఉన్నదున్నట్లు గర్వంగా చదివాడు:

'ఉస్మానియా విశ్వవిద్యాలయంలో చదువుతూన్న ఎమ్మే విద్యార్థి, శ్రీ పరశురాములు గారిని విద్యార్థుల ఆందోళనకు నాయకుడుగా రూపొంది నందుకు, నిన్న ఫతే మైదానంనుండి బయలుదేరిన ఉత్సవంలో అరెస్టు చేశారు. వారి దేశభక్తి అపారం. విద్యార్థిలోకం అతనికి హృదయ పూర్వకమైన అభివందనా లర్పిస్తూంది. అంతటి దేశభక్తుని ఆవిర్భవానికి కారణమైన నాగులపల్లి గ్రామానికి, అతని తలిదండ్రులకు మా సానుభూతి.

——విద్యార్థి సంఘం, హై—ద.'

ఈ వార్త వింటూనే జానకమ్మ వెక్కివెక్కి యేడ్వ మొదలిడింది, "ఇదియా మీరు నాకు తెచ్చిన శుభవార్త?" అని. జ్యోతి దుఃఖాన్నాపుకోలేక రెండు చేతులతో ముఖాన్ని కప్పుకుని ఇంట్లోకి వెళ్ళిపోయింది.

తరువాత ఆ పెద్దమనిషి ఊరివాళ్ళందరికీ వార్తా పత్రికలోని విషయాన్ని కొండంతగా చేసి చెప్పాడు. తమ ఊరిపేరు పేపర్లో అంతగా వ్రాయబడటంవల్ల వారందరూ ఉప్పొంగిపోయారు. అతడూ, ఇంకా కొందరు పెద్దవాళ్ళూ ఎంతో సానుభూతి చూపిస్తూ పరశురాం తల్లిని ఊరడించారు. కొద్దిరోజుల్లోనే విడుదల అవుతాడని నమ్మబలికారు. నాటినుండీ ఆ యూరివాళ్ళంతా జానకమ్మ సేవకు రెక్కలు కట్టుకుని వాలేవారు.

ఆమె మనశ్శాంతి కొఱకు ఏమిచేయాలన్నా ఎల్లవేళలా తయారుగా యుండేవాళ్లు. జ్యోతి వాళ్ళందరికళ్ళకు దివ్యలోకంలోని మహారాణి; ఎందుకంటే ఆనాడు పరశురాం ఆ వూరికి దేవేంద్రుడులా అగుపడ్డాడు. అతని వల్లనే తమ ఊరిపేరు వార్తాపత్రికలలో —అచ్చులో— పెద్ద అక్షరాలతో, మొదటిపుటపై వచ్చింది కనుక.

అప్పుడప్పుడు తమ యూరిపేరు వార్తాపత్రికల్లో వస్తూంటే ఊరివాళ్ళ ఆనందానికి హద్దూ పద్దూ లేకపోయింది. భారతదేశ చరిత్రలో వాళ్ళ గ్రామానికి గూడా కొన్నిపుటలు ప్రత్యేకింపఁబడుతాయనుకున్నారు. చరిత్రకారులు పరశురాంతోబాటు ఊరివాళ్ళందరినీ వీరుల్లో లెక్కవేసి వ్రాస్తారని పగటికలలు కన్నారు. పేరుప్రతిష్టలవిషయమై ఊరివాళ్ళందరూ స్వేచ్ఛను —స్వాతంత్ర్యాన్ని— కోరుతున్నా, బయటికిమాత్రం తమ ఉబలాటాన్ని పొక్కనిచ్చేవారు కారు. అందుకు రెండేరెండు కారణాలు: ఒకటి, ఊరివాళ్లలో అధికసంఖ్యాకులు భీరువులు. రెండోది, వాళ్లు రాష్ట్రం గణరాజ్య సమితిలో చేరిపోవాలని ఆకాంక్షిస్తే ముస్లింలకది కంటగింపు.

* * *

కుమారుఁడెన్ని కష్టాలకు గుఱి అవుతున్నాడో అనే తలంపు రావటంతోనే జానకమ్మ ఒళ్ళంతా భయమూ, దుఃఖంతో కంపించింది. తనకున్నదే ఒక్కకొడుకు - అదీ జైల్లో. ఆమె హృదయంలో అగ్నిపర్వతాలు ప్రేలినట్లయింది. ఎలాగైనా కొడుకును చూడాలనే ఆతురత ఎక్కువయి, ఆ యూరి పెద్దమనిషి చేతుల్లో కొంత డబ్బుపోసి ఎలాగైనా పరశురాంను విడిపించుకు రమ్మంది. ఆమె పడుతున్న ఆవేదనను చూడలేక అతఁడు వెళ్ళి పోలీసు అధికారికి లంచంకొట్టి "ఇంకెప్పుడూ మా వాఁడలాంటి 'తప్పుడుత్రోవ' నడువ"డని హామీయిచ్చి పరశురాంను విడిపించుకొచ్చాడు.

రెండేళ్ళ విధింపబడిన కఠినశిక్ష ఇంతత్వరలో అయిపోయిందా, అని ఆశ్చర్యంతో పరశురాం జైలు దాటి బయటికిరాగానే ఆ పెద్దమనిషి అగుపడ్డాడు. అతన్ని చూస్తూనే జరిగిందంతా క్షణంలో గ్రహించాడు పరశు. "ఏమిటి గోవిందయ్యా మామా! నువ్వుచేసింది నాకు మేలుగాదు; దేశానికి ద్రోహం చేశావు." అని ఆవేశం, కోపం, అసహ్యం ప్రకటించాడు. ఆ పెద్దమనిషి గోవిందయ్య మరేమీ చెప్పలేకపోయాడు; కాని అతని తల్లి ఆవేదనను మాత్రం వివరించాడు.

పరశురాం ఇంటికివచ్చి తల్లి పాదధూళి తీసుకున్నాడు. జానకమ్మ దుఃఖ ముపశమించింది. జ్యోతి తనబావ ఇంకెక్కడికీ వెళ్ళడని నమ్మింది. మనస్సులో వేయిదేవుళ్ళకు మ్రొక్కింది.

పరశు ఆ యూరి వారందరితోనూ కలిశాడు. వాళ్లెవరు, వాళ్ళకూ దేశానికీ గల సంబంధమేమిటి ఇత్యాది విషయాలన్నీ వివరంగా చెప్పాడు. యువకుల్లోని రక్తం పొంగింది. కొందరు 'ఎందుకు నాయనా ఇదంతాను; ఏ ప్రభుత్వమైతేనేం?" అని బానిస తనాన్ని బయలుపరచారు. కాని అతఁడు వారిమాటల నేమీ సరకుగొనలేదు. ఊరివాళ్లందరికీ ధైర్యంచెప్పి, తల్లికి తన్నుగూర్చి బెంగేమీ పెట్టుకోవద్దనిచెప్పి మూఁడవరోజునే తిరిగి ప్రయాణమయ్యాడు. వెళ్లవద్దని తల్లిఎంతో బ్రతిమాలింది; కాని అతడు వినలా వెళ్లేప్పుడు తన మేనమామ కూతురుతో "జ్యోతీ, అమ్మను నువ్వున్నావనే నమ్మకంతో విడిచివెడుతున్నా. నీవు దుఃఖించి ఆమెకు గూడా గుండె పగలకొట్టావంటే నాపైని ఒట్టు." అని లాలింపుమాటొకటి అని వెళ్లాడు. జ్యోతి తనస్వామి, కార్యంనెగ్గి, సురక్షితంగా రావాలని భగవంతుడ్ని ప్రార్థించింది. ఊరినుండి కనుచూపుమేర దాటిపోయిందాక ఆమె అతని పోకడను అశ్రుజలభరిత నయనాలతో చూస్తూ నిల్చుంది. వీలయినంత వరకు తన దుఃఖాన్ని మరుగుపరచి ఎప్పుడూ అత్తగారికి ధైర్యంచెబుతూ ఓదారుస్తూ యుండేది. ఆమె దుఃఖాన్ని చూస్తే స్వామి తనపట్ల ప్రసన్నంకాడేమో! స్వామి ఆగ్రహానికి గురిఅయితే మరి తనజీవితం?

* * *

పరశురాం ఊరికి వచ్చినప్పుడు అక్కడ పతాకారోహణ ఉత్సవాన్ని జరిపిపోయాడు. అదృశ్యం అక్కడి ముస్లింలలో సంచలనం కలుగఁజేసింది. ఎందుకంటే వారూ నిజాంప్రభువు పరిపాలన శాశ్వతంగా ఉండిపోవాలనే జాతికీ, మతానికీ చెందినవారు వాళ్లందరూ ఇక ఆ గ్రామంలో అలాంటిదేమీ జరగనివ్వకూడదని కూడబలుక్కున్నారు.

అంతలో గాంధీదేవుని డెబ్బది తొమ్మిదో జయంతి ఆసన్నమైంది. ఊరిలోని యువకులు ఆజన్మ దినోత్సవం వైభవంగాజరపాలని ఉత్సాహంతో సన్నాహాలు చేస్తూండటంచూచి ముస్లింలు తమలో తామైక్యమై దగ్గరిస్టేషను నుండి పోలీసుల్ని పిలిపించారు. ఎర్రటోపీలు చూడటంతోనే యువకుల్లోని ఉత్సాహం నీరుగారిపోయింది. ఎక్కడివాళ్లక్కడ కుక్కిన పేనుల్లా కూర్చున్నారు. అయినా, డబ్బు వ్యయంచేసి తమయూరిలో గాంధీ జన్మదినోత్సవం జయప్రదంగా జరిగినట్లు పేపరులో వేయించుకుని మురిసిపోయారు. బండారం బైట పడిందని ముస్లింలు లోలోపల నవ్వుకున్నారు.

మళ్ళీ వార్తవచ్చింది పరశురాం బంధింపబడ్డాడని. ఈసారి నాలుగేళ్ళు కఠిన శిక్ష. అంతకు ముందుకూడా ఎన్నోమారులు అరెస్టుచేయబడ్డాడని పేపరుల్లో చదివారా ఊరివాళ్లు. ఎప్పటికప్పుడే విడిచిపుచ్చుతూండడం కూడా జరిగింది. పరశురాం అరెస్టుచేయబడ్డప్పుడూ, విడుదల అయినప్పుడూ ప్రతిసారీ నాగులపల్లి పేరు పేపరులో పడుతూనేవుంది. ఈసారి నాలుగేళ్ళ శిక్ష విధించారని తెలిసి జానకమ్మ హృదయం తపించిపోయింది.

* * *

రజ్వీ రజాకార్ల దుండగాలధికమవుతున్నై. అంతవరకు హిందువులతో సోదరభావంగా చరించిన ఆ వూరి ముస్లింలుకూడా ముమ్ముందు జరగబోయే ఘట్టాన్నిగురించి ఆలోచించకుండానే, రజాకార్ల ముఠాలో చేరి, ముస్లిమేతరులతో పేచీపడటానికి సంసిద్ధులయినారు. ఆ ఊరివారికందరికీ గుండెదడగానే వుంది.

భారతీయులు తమ బుద్ధిలోపంతో చేతులారా బాపూజీని చంపుకున్నారు 1948 జనవరి 30 శుక్రవారంనాడు. ముస్లింలేమిచేసినా శాంతంగా యుండమని ప్రభోదించే మహాత్ముడు మాడిపోయినందుకు హిందువులు తిరగఁబడతారేమో ననే భయం ముస్లింల మస్తిష్కాల్లో మెరిసింది. కాని గాంధీజీ ఆశయాలపై మొదటినుంచీ కొంతగా కున్నా కొంతయినా నడువనేర్చిన హిందువులు ఆయన మరణంతో, ఆయన సిద్ధాంతాలనే ఎక్కువగా పాటించసాగారు. హిందువులు రజ్వీ రజాకార్ల దుండగాల్ని ప్రతిఘటించలేకపోయారు. దాంతో రజాకార్లు మరీ చెలరేగారు. ఎటు చూచినా కల్లోలంగావుంది. ఆ ఊరిలో కొందరు పెద్దమనుష్యులు ప్రాణాలు దక్కించుకోటానికి డబ్బు మూటగట్టుకుని కుటుంబాలతో ఇళ్లువదిలి యూనియన్ ప్రాంతాలకు తలదాచుకోబోయారు; గోవిందయ్య గూడా.

* * *

కుమారుని సంగతి జ్ఞప్తికొచ్చినప్పుడల్లా జానకమ్మ హోరున విలపించేది. మొదటిసారికే ఉన్న డబ్బు కాస్తా అయిపోయింది. కొడుకు జైల్లో వుంటే ఆమె ఇంటిదగ్గర ఉండలేకపోయింది. ఆ వృద్ధమాత ఒక యువకుడిని ఊతగా తీసుకుని పట్టణానికి వెళ్ళింది. అక్కడి పోలీసు అధికారిని కాళ్ళావ్రేళ్ళాపడి మొరపెట్టుకుంది తన కొడుకును విడిచపుచ్చమని. అతడామెను జైలుగది తలుపు దగ్గరికి తీసుకువెళ్ళి ఆమె కుమారునితో "మిస్టర్, పరశురాం! ఇదుగో చూడు మీ తల్లి ఎంతగా ఏడుస్తుందో. నీవికముందయినా రాజకీయ విషయాల్లో జోక్యం కలుగజేసుకోనని ప్రమాణపత్రం వ్రాసియిస్తే విడుదలచేయిస్తాను. ఆమె కడుపుమంట చల్లార్చు. ఇదుగో నిన్నుగన్న తల్లి"అంటూ, విలపిస్తూన్న అతని తల్లిని చూపించాడు. ఆమె కుమారుణ్ణి ఆశాపూరిత నయనాల్తో చూచింది.

తల్లి స్థితినిచూసి పరశు ఒప్పుకుందా మనుకున్నాడు. కాని అతని హృదయం ఒప్పుకోలేదు. వెంటనే ధైర్యంవహించి. తల్లి దైన్యాన్ని చూసి పొరలివచ్చిన దుఃఖాన్నాపుకుంటూ పోలీసధికారిని కొరకొరచూస్తూ "నీమాటనెన్నడూ పూర్తిచేయను. నీకు నా ఈ ఒక్క తల్లిమాత్రమే కనిపిస్తుంది కాబోలు. అదుగో, నీ అంతఃచక్షువుతో ఒకసారి చూడు. తన బిడ్డల్లో క్రూరులైనవారు సాధువుల్ని హింసిస్తూంటే ఆ భారతమాత ఎంతగా విలపిస్తూందో! ఆమె నిన్ను, నన్ను, మా అమ్మనుగన్న తల్లి, నలుబదికోట్ల భారతీయుల తల్లి. ఆమె కడుపులో రగుల్తూన్న చిచ్చును చూడు. అందరి బాధలూ నివారించి ఆతల్లి ఏడ్పు మాన్పమంటావా? లేక నా స్వార్థంకొఱకు ఈ తల్లిని మాత్రమే ఓదార్చి, దేశమాతకు తీరని ద్రోహంచేసి నరకంలో పడమంటావా?" అన్నాడు.

కుమారుని మాటలువిని కంటనీరు కాల్వ గట్టుతూ ఉంటే తలవంచుకుని నిలుచుని యుంది తల్లి. పరశురాంతల్లిని సంభోదిస్తూ "అమ్మా నీవు దుఃఖించకు. దేశం నీకు ఋణపడియుంది. దేశమాత దుఃఖనివారణకు నీవొక అమూల్య రత్నాన్ని గన్నావు. అంతటితో తృప్తిపడమ్మా. నీకుస్వర్గం" అని చెప్పి వెనక్కి మరలిపోతూంటే జానకమ్మ ఏడుస్తూ చేతులుచాచి నిస్సత్తువచే ఒరుగబోయింది. తోడువచ్చిన యువకుఁడు పట్టుకున్నాడు. ఆమె రిక్తహస్తాలతో గృహోన్ముఖమై వచ్చింది. సంగతి తెలిసి జ్యోతిగుండె దద్దరిల్లిపోయింది.

* * *

రజాకారులు ఆడని అన్నృతం, అనుసరించన దుర్మార్గం, ఆచరించని అమానుషం, పాల్పడని నైచ్యం, ఒడగట్టని పాపమంటూ లేకపోయింది. హయిదరాబాదు రాష్ట్రంలోని పీడిత జనులంతా ప్రాణాలరచేతుల్లో బిగపట్టుకుని, భగవంతునికి మారుగా నెహ్రూను, అతని సహచరుల్ని ప్రార్థించారు వచ్చి రక్షించమని. భగవంతుఁడు దుర్మార్గ పక్షపాతి అనే నమ్మకం స్థిరమైందేమో వారికి.

నిజాం నవాబు రాయబారం చాలా పొడుగ్గా సాగింది. తన బలహీనతకు కారణంగా ఎందరు బలి అవుతున్నా ఆ దృశ్యాన్ని కంటఁ జొర నిచ్చాడు కాడు. ఆతఁడు రజాకార్ల నాయకుఁడైన రజ్వీచేతుల్లో కీలుబొమ్మగా మారిపోయాడు.

ఆఖరుకు 13వ తేదీ సెప్టెంబరు, 1948 నాడు కేంద్రప్రభుత్వం హైదరాబాదుపై పోలీసు చర్య తీసుకుంది. చాలా తక్కువ ప్రాణనష్టం మీదనే విజయాన్ని సాధించింది. విప్లవకారకులకు బేడీలు పడినయి. నాయకుఁడు పట్టుబడ్డాడు. ఇదంతా మూఁడు రోజుల్లో ముగిసింది.

పోలీసుచర్య జరుగుతూన్న మూఁడు రోజుల్లోనే నాగులపల్లిలో ఘోరం జరిగింది. హిందువులపై కసితీర్చుకోటానికిఇదే సమయమని, మించితే దొరకదని, ఆ వూరి ముస్లింలే ఇతర రజాకార్ల సహాయంతో ఊరిని కొల్లగొట్టారు. స్త్రీలకు చాలా మందికి మానభంగం జరిగింది. వృద్ధులు, పసిపిల్లలు అనే తేడాలేకుండా ఎదుటపడిన వాళ్ళంతా రజాకార్ల కాల్పులకూ, కత్తులకూ బలి అయి పోతూంటే అందరూ అడవుల్లోకి నిజప్రాణ రక్షణార్థమై పారిపోయారు. జ్యోతి గూడా అందులో వెళ్ళింది.

పరిస్థితులన్నీ శాంతపడిన తరువాత యింటికి కొచ్చేసరికి జ్యోతి అత్తగారి శవాన్ని చూడ గలిగింది. ఎవరి ప్రాణాలను వారు రక్షించుకోన టానికి అడవులంబడి పరువెత్తిన తొందరలో అత్త జ్ఞాపకమ్మే రాకపోయింది. ఆ జాతీయ వీరుఁడు, తన బావ విడుదలయి వచ్చి తల్లిని గానక యెంత వాపోతాడో అని దుఃఖించింది. ఆమె ప్రాణం పోయి, అత్త బ్రతికివుండినా ఎంతో బావుండేది, అని అనుకుంది. కాని జరిగిపోయినదానికి ఎవరేం చేస్తారు? విధి.

ఆమె రోజులు గడుపుతూంది ఎందరెన్ని విధాల ఓదార్చినా ఓర్పుఁ జెందక. సరిగా ఆహార పానీయాలు పుచ్చుకోనటమే మానివేసింది. తుదకు తన బావచేత నిగ్రహింపఁబడుతానేమోననే బెంగ పట్టుకుంది.

హైదరాబాదులో తాత్కాలిక మిలిటరీ ప్రభుత్వ మేర్పడింది. వాతావరణం ప్రశాంతమైన తరువాత యూనియన్ ప్రాంతాలకు తలదాచుకోబోయిన పెద్దమనుషులు ఘుమ్మల్లా వచ్చారు. "మేం వెళ్ళి నెహ్రూతో మొరపెట్టుకుంటే ఆయన పటేలుద్వారా పోలీసుల్ని పంపి రజాకార్ల పీచ మణచారు" అని డంబాలు పలికారు ప్రజలతో. అవునేమో ననుకున్నారు అమాయక ప్రజలు.

కొద్ది రోజులకే రాజకీయ ఖైదీలను విడుదల కావిస్తారన్న వార్త వెలసింది. పరశురాం విడుదల అయి వస్తాడని ఆ వూరివాళ్ళు తేదీక్కై నిరీక్షిస్తున్నారు. అతనికి ఘనస్వాగత మివ్వాలనే ప్రయత్నాలను కూడా చేస్తున్నారు.

* * *

ఆనాఁడతని జీవితంలో శుభోదయం. రాజకీయఖైదీలతో విడుదలయిన పరశురాం తనయూరికి చేరాలని దగ్గరయున్న స్టేషనులో రైలుదిగాడు. ఆనాఁడు ప్లాటుఫారంఅంతా జనంతో నిండియుంది. ఆ జనమంతా నాగులపల్లివారే. రైలుదిగటంతోనే గోవిందయ్య, జానకిరామయ్య, గోపాలరెడ్డి మున్నగువారంతా వచ్చి అతడ్ని పూలమాలలతో అలంకరించారు. ఇదంతా ఏమిటన్నట్లు పరశు ఆశ్చర్యాధిక దృక్కుల్తో ప్రశ్నించాడు వారిని

'ఈనాడు మాకు పర్వదినం' అన్నారు వాళ్ళు. స్టేషనుండియే గొప్పఊరేగింపుతో జేజేలుకొడుతూ, అందంగా అలంకరించబడిన బండిలో తెచ్చారు. అతనికి స్వాగతమివ్వటానికి వచ్చిన వారిలో ముస్లింలు తలలు వొంచుకుని యుండటంచూచి పరశు కొంచం జాలిపడ్డాడు; పెద్దమనుషులంతా వారిని బలాత్కారంగా లాక్కొచ్చినట్లు పసికట్టి 'అయ్యోపాపం! చచ్చినవాళ్లనింకా చావగొడ్తున్నా రనుకున్నాడు మనసులో, ఉత్సవం సాగిపోతూంటే మేడల మీదనుండి స్త్రీలు పూవుల్ని పన్నీరును చల్లారు జనసమూహపు బరువుతో మిద్దెలన్నీ ఊగిపోతున్నాయి.

నాడు ఆ ఊరిలో ప్రతిఇంటిలోనూ పండుగ జరిగింది. ఊరివాళ్ళంతా పెద్దసభచేసి అతఁడు చేసిన త్యాగాన్ని గొప్పగా చెప్పుకున్నారు. ఆఖరులో తాము పరశు మాతృశ్రీని రక్షించలేక పోయినందుకు సంతాపాన్ని వెలిఁబుచ్చారు.

పరశుకు తల్లిని చూడలేక పోయినందుకు విచారం కలిగింది. కాని ఆనాఁడు హైదరాబాదు స్వాతంత్ర్య లక్ష్మికొఱకు బలిఅయిన ప్రాణాల్లో తన తల్లిదిగూడా ఒకటనుకుని సంతృప్తిపడ్డాడు. ఇతరుల ఎదుటకూడా ఆ ఘట్టాన్ని సామాన్యంగానే వివరించాడు.

ఏదో మహాపరాధం చేసినదానిలా జ్యోతి మొట్టమొదట పరశుకు ముఖమైనా చూపటానికి ఇష్టపడకపోయింది. ఆమె పడుతూన్న బాధను గుఱించి తెలిసికొని "జ్యోతీ, అనవసరంగా దుఃఖ పడుతూన్నావు. పండుటాకులు ఎన్నడైనా రాలి పోవాల్సిందేకదూ! ఆమె కర్తవ్యం దివ్యంగా నెర వేర్చుకుంది. ఇక మనం మిగిలాం." అన్నాడు ఓదారుస్తూ. జ్యోతి దుఃఖం క్రమంగా మాసి పోయింది.

ఊరివాళ్ళ ప్రోత్సాహంమీద యూనియన్ నుండి వచ్చిన మిలిటరీవాళ్ళు అడ్డుపడిన ముస్లింల నంతా శిక్షిస్తున్నారు. సర్వనాశనం చేస్తున్నారు. పరశు దానిని ఆపుచేశాడు. వాళ్ళందరినీ సమావేశపరచి "మనజాతి, మన సంస్కృతీ తోటి సోదరుల తప్పులను కడుపులో దాచుకోలేనంత అనాగరిక జాతికాదు." అని బోధించాడు. అప్పు డందరూ అతని విశాలదృష్టిని పొగడారు.

నాటినుండి అతనిపేరు మ్రోగిపోయింది. అంతటి దేశభక్తుఁడు వెతికినా దొరకడని అందరూ అనుకోఁజొచ్చారు. అవును నిజంగానే అతఁడొక దేశభక్తుఁడు. తనవిద్య, సేవద్వారా దేశానికి పట్టుఁ గొమ్మలయిన పల్లెవాసుల జీవనానికి రంగులు దిద్దు దామనుకున్నాడు. కాని అమాయకులయిన పల్లీయులలోనే కొన్ని కుటిలశక్తులుంటాయనీ, వాటిని గ్రహించి ఎదురుకోవటం సాధ్యం కానిపని అనీ అతఁడు ముందుగానే ఊహించలేక పోయాడు. ఎంతైనా అనుభవ రహితుఁడు!

ఆ తాలుకాలోను, చుట్టుపట్ల ప్రాంతాలలోనూ ఎక్కడ ఏ విద్యాలయాన్ని తెరచినా, ఏ ఆసుపత్రికి శంఖుస్థాపన చెయ్యాల్సి వచ్చినా, ఏ చెఱువు త్రవ్వించాల్సినా పరశురాం చేతుల మీదుగానే జరగాలి. పరశురాం లేకపోతే దేశమే లేదనుకున్నారు. ఆ సమయంలో ప్రజలకు, పరశు సూర్యుఁడిని తెమ్మని ఆజ్ఞాపించినావారు వెనుదీసే వారుకారు. "ఇంకా ఏంకావాల"ని అడిగేవారే.

* * *

అన్ని ఊళ్ళలోవలె ఆ యూరిలోనూ పంచాయతీ సభకు ప్రతినిధుల్ని ఎన్నుకున్నారు. ప్రజలు ఇంకెవర్ని ఎన్నుకుంటారు? వారినే; పరశు, గోవిందయ్య, జానకిరామయ్య, గోపాలరెడ్డి. హరిజనులలోనుండి గూడా ఒకరిని ఎన్నుకోవలసి యుంది కనుక బాలయ్యను ఎన్నుకున్నారు. పరశుకు పదవికావాలనే కోరిక ఎప్పుడూ లేదు; కాని అందరి బలవంతాన తల వంచుకు పదవిని స్వీకరించాడు.

రజాకారులుగా యున్నప్పుడు ముస్లింలు బలవంతాన ప్రజలనుండి వసూలుచేసిన విత్తాన్ని తిరిగి సేకరించారు. ఊర్లో ఏమైనా అవసరమొచ్చి, ప్రోగుచేసిన విరాళాలలో మిగిలిన డబ్బునుకూడ పంచాయతీబోర్డు వారే భద్రపరచారు. ఆ పని పరశురాంకే అప్పగించారు. తద్వారా దేశానికి తన ఋణం తీర్చుకోవాలనుకున్నాడు.

కొన్నిరోజులు దొర్లినయి. ప్రశాంతంగా సాగి పోతూన్న పల్లెవాసుల జీవిత వాతావరణంలో దుర్గంధం తలెత్తింది. ఒక సంవత్సరమైనా పూర్తి కాకముందే ప్రజలకు దృష్టిలోపం సంభవించింది. కారణం: పరశుకు చేదోడుగా యుంటున్న పెద్ద మనుషులంతా అతడనకున్నంత విశాల భావాలు

కలవారుకారు. పంచాయతీ సభ్యుల సమావేశంలో హరిజనుడు బాలయ్యకు తమతోపాటు స్థానాన్నిస్తే వాళ్ళందరికీ గౌరవలోపంగా తోచింది. పరోక్షంలో పరశుతో వారా ప్రస్తావన తెస్తే "అందరమూ మానవులమే; అదీగాక అతనికి మనతో సమానదర్జా అధికారరీత్యా యున్నప్పుడు మనమలా ఎన్నడూ భావించరా"దన్నాడు. ఆవిషయమై పరశుతో ఎక్కువ వాదించటంవల్ల ఫలితం శూన్యమని యెంచి వాళ్ళు మనస్సుల్లోనే దాచుకున్నారు. అప్పటికేమీ అనలేదు. అందరూ ఉల్లాసంగా జీవితాలను గడుపటానికి పరశుపడే పాట్లన్నీ వాళ్ళకు సహించరానివిగా మారినయి. వారందరూ, దర్జాకొఱకు ప్రాకులాడేవారు. అతని కృత్యాలు ప్రజలనందరినీ ఆకర్షించ సాగినయి. అతని పేరు ప్రాకిపోతూంది. ఇదంతా చూసి మండి పడ్డారు వాళ్ళు.

ఆ పెద్దమనుషులు ఎంతో మంచితనాన పరశురాందగ్గరినుండి ప్రజల సొమ్ములోంచి కొంత అప్పుగా తీసుకున్నారు; ఒకరు కూతురి వివాహానికని, మరొకరు గృహప్రవేశ మహోత్సవానికని ఇంకొకరు ఏదో సాకుచెప్పి, ఇదంతా బాలయ్యకేమీ తెలియదు. బాలయ్యా తమతోబాటు కూర్చుంటాడనే "భయం" కొద్దీ వాళ్ళసలు సమావేశాలకు ఏదో మిషపెట్టి రాకపోయేవారు. మళ్ళీ తప్పక ఇస్తారుకదా అని మాట నమ్మకంమీద పరశువారికి ధనం ఇచ్చాడు.

కొన్నాళ్ళకు వారుముగ్గురూ పరశు ఇంటికివెళ్ళి రహస్యంగా "పరశురాములుగారూ, మేం తీసుకున్న డబ్బుమళ్ళీ ఇవ్వలేం. అసలు ఇచ్చే అవసరంగూడా ఏముంది కనుక? మీరూ ఆ మిగిలిందాన్ని వెనకేసుకోండి. మనల్ని అడిగే వాళ్లెవరూ లేరు." అని సలహానిచ్చారు. వాళ్ళ పరివర్తనకు పరశు ఆశ్చర్యపోయాడు. వాళ్ళు తలపెట్టిన అసభ్య దోపిడిని తెలిసికొని "క్షమించండి నేనంత నీచుడ్ని కాను." అన్నాడు.

పరశు ముఖ కవళికల్నిచూసి వారంతా ప్లేటు మార్చారు: "ఏమండీ అలా అయిపోయారు? హాస్యానికంటేనే! మేం ఎగ్గొడతామనుకున్నారా?" అంటూ నవ్వారు, అమాయకంగా పరశూ వారినవ్వుతో తన నవ్వును లయించాడు.

ఆనాఁడు జ్యోతి పరశుల వివాహం. ఊరివాళ్ళంతా సంబరంతో వివాహంలో పాల్గొన్నారు వరుఁడు, వధువుమెళ్లో మగళసూత్రం కట్టబోయే సమయంలో పోలీసులువచ్చి అతనిచేతులకి సంకెళ్లు తగిలించారు. ఆ దృశ్యం ప్రజలకేమీ అర్థంకాలేదు. పరశు అక్కడే కూర్చున్న పెద్దలవైపు చూశాడు. వారి మొహాల్లో నిర్లక్ష్యం ప్రతిబింబించింది. పోలీసులు తాము చేస్తూన్న పనికి, పరశు గ్రామప్రజల విరాళాల్ని కాజేయటమని తెలిపారు. పరశు పోలీసులతో వెళ్ళింతరువాత జ్యోతి తన దౌర్భాగ్యానికి గోలుగోలున ఏడ్చింది.

ప్రజలు తమపై తిరుగబడతారని ఊహించి ఆ పెద్దమనుషులు అక్కడ సమావేశమైన వారందరికీ "పరశు ఎంతో మంచివాడని మనమంతా నమ్మి అతనిచేతుల్లో అన్నిభారాలూ ఉంచితే మనకే ద్రోహంచేశాడు. అతఁడు తన సౌఖ్యాన్నే చూచుకున్నాడు కాని ప్రజలజీవితాన్ని బాగుపరచలేదు, ఆనాఁడు మనల్ని హింసించిన రజాకార్లపై కక్ష తీర్చుకుంటూంటే ఎందుకడ్డుపడ్డాడో తేలింది- ముస్లింలనుండి లంచం తీసుకుని, పైగా తన విశాలదృష్టిని మనకు చూపాడు. ఈనాడు తన వివాహం ఇంత వైభవంగా జరుపుకోవటంగూడా మీ డబ్బువల్లనే ఇతని చర్యలు మొదటినుండీ మా కనుమానంగానే యుండినయి. చాలానాళ్ళనుండీ అతని పోకడను గమనించాం. మొదటనే మీకు అతనిలోపాల్ని చూపేవారము. కారి అతని ప్రభావంలో పడిపోయిన మీ కాసమయంలో సరిగ్గా స్ఫురించదని, సమయం కొరకు వేచాం. మరీ మితిమీరి పోతూంటే, మన పల్లీయుల జీవితాల్లో అగ్నిరగుల్తూంటే చూడలేక పోలీసుల్ని రప్పించాం. మీరే ఆలోచించుకోండి. మేం చేసింది మేలో కీడో." అని ఒకరితరువాత ఒకరు ఉపన్యసించారు. అమాయక ప్రజానీకం అదంతా నిజమేనని నమ్మి పరశుని తాము నూరే ఖారాలు మిరియాలకు గురిచేసింది.

* * *

ఆనాడతని జీవితంలో పతనోదయం. పరశు తాను చేసిన "మహాపరాధానికి" అయిదు సంవత్సరాల జైలుశిక్ష అనుభవించి చిక్కిపోయిన ఎముకల గూడు నీడ్చుకుంటూ తన గ్రామానికి వచ్చాడు.

ఎవ్వరూ పలకరించలేదు. అతణ్ణిచూసి అందరూ దూర దూరంగా తొలఁగిపోయారు. మండుటెండలో కాళ్ళీడ్చుకుంటూ వస్తే ఎవ్వరూ ఇంత దాహమైనా ఇచ్చారు కారు. అతణ్ని చూచి, అల్లరి పిల్లలంతా పిచ్చివాడని కేకలు వేస్తూ వెంట పడ్డారు. ఆ గోలవిని మూలల్లో మూల్గుతూ పడియుండిన ముసలివాళ్ళుకూడ ద్వారబంధాలదాకా వచ్చి, అతనివైపుచూచి అసహ్యంతో ప్రక్కకు ఉమిశారు. పిల్లలు ఆ'పిచ్చివాడి'పై రాళ్ళవర్షం కురిపించారు. తగిలిన గాయపు లోతులలో ఏ కోశానవో మిగిలిన రక్తం కాస్తాచిందింది. అతఁడేమీ చేయలేకపోయాడు; దీనంగా చూశాడంతే.

మొదట తన ఇల్లు ఉన్న చోటికి వచ్చాడు; ఎవరో అడ్డగించారతణ్ణి. అక్కడ తన యిల్లు లేదు. అది యీనాడొక మేడ. పెద్దలుదాన్ని వశపరచుకున్నారు.

అతఁడు తనజ్యోతిని కలుసుకుని ఎక్కడికో వెళ్ళి ఇలాంటి కల్మషాలు లేనిచోట ఒక పవిత్ర జీవితం గడుపుదామనుకున్నాడు. పరిస్థితులు అతనికి సులభంగా బోధపడినయి. అవును. పెద్దలు ఆమె నవమానించారు. ఆమె ఆత్మహత్య చేసుకుంది. శవాన్ని రాళ్ళుకట్టి ప్రక్కనదిలోపారవేయించారు. ఆ విషయం ఎక్కడా బయల్పడ నివ్వలేదా 'ఘనులు.'

ప్రపంచంలో తనకేమీ మిగులకపోగా ప్రక్కనే యున్న నదివైపునకు దారితీశాడు. జ్యోతి పిలిచిందేమో! అంతవరకూ రాళ్ళువిసురుతూ వెంట పడిన పిల్లలు "ఏయ్, అక్కడ మడుగులో మొసలి యుంది, చస్తావు"అని కేకలువేస్తూ పారిపోయారు. ఆ విషయమతనికి తెలియదు. అది చిన్నప్పుడు తానూ జ్యోతీ కలిసి ఆడుకున్న చోటు.

నదిలో మడుగు దగ్గర ఒడ్డుపై కూర్చుని కాళ్ళతో నీటిని కదుపుతూ, గతజీవితాన్ని స్మరించుకుంటూ సొమ్మసిల్లి పడిపోయాడు. మడుగులోని మొసలి తోకతో గొట్టి బాగా గాయపరచి ఈడ్చుకు పోయింది.

ఆ రాత్రికే కుంభవృష్టి కురిసింది. నది ఒడ్డులొరసిపారి, అతని శవాన్నికూడా తీసుకుపోయింది. ఎక్కడో తీరానికి చేరితే, ఆ నిరాకార శవాన్ని చూసి అందరూ "ఏ పాపాలకు ఫలితమో!" అని అన్నవారేగాని ఒక్కరైనా 'పాపం!' అని సానుభూతి చూపారు కారు.

---

కథానిక

# ఒకటో తారీఖూ - సర్వేశం

## యర్రా మురళీ కృష్ణమోహన్

ఎప్పుడు ఎప్పుడు అనుకొన్న ఒకటో తారీఖు రానే వచ్చింది. రోజూకంటె పెందరాళే లేచి కాలకృత్యాలు తీర్చుకొని, కాఫీవగైరా ముగించి తన రాబోయే జీవితంలో తను చెయ్యబోయే ఖర్చులు గురించి ఆలోచిస్తున్నాడు సర్వేశం.

అతని నెలసరిప్రణాళిక తయారయింది.అందులో మొదటి అంశం, అయిదు నెలలనుంచి ఏ నెలకా నెల వాయిదాపడ్తున్న 'కొత్తచెప్పులు కొనటం.'

సర్వేశం ఒకసారి మూలనున్న ముసలిచెప్పుల వంక చూసాడు. అతనిలో సానుభూతి వెల్లివిరిసింది. "పాపం మీరు నాకోసం సంవత్సరంనుంచి శ్రమపడుతున్నారు, ఈవాళతో మీశ్రమ తప్పుతుంది" అన్నంత అర్థంవుంది అతనిచూపుల్లో.

అయిదువిమిషాలు ఖాళీదొరికితే ఆఫీసుఫైళ్ళ మధ్య కూర్చునే సర్వేశం తీరిగ్గా కూర్చుని ఆలోచించటంచూచేసరికి సర్వేశం భార్యకి అకస్మాత్తుగా జ్ఞాపకంవచ్చింది- ఆవాళ ఒకటీ తారీఖు అని.

"చూశారా, జాకెట్లన్నీ ఎలా చిరిగిపోయాయో" అందామె అతన్ని సమీపిస్తూ.

"ఆఁ! చూస్తూనేవున్నా" అన్నాడతను.

"ఈవాళ జీతాలొస్తాయిగా సాయంత్రం వచ్చేటప్పుడో రెండుజాకెట్లకు గుడ్డతీసుకురండి చౌకలో"